క్లుప్తంగా

వ్యాన్‌ను ఢీకొట్టిన పెళ్లి బస్సు

తప్పిన పెను ప్రమాదం



ప్రత్తిపాడు జాతీయ రహదారిపై వ్యాన్‌ను ఢీకొన్న పెళ్లిబృందం బస్సు

ప్రత్తిపాడు: జాతీయ రహదారిపై ప్రత్తిపాడు వద్ద గురువారం జరిగిన ప్రమాదంలో పెనుముప్పు తప్పింది. ముందు వెళుతున్న వ్యాన్‌ను పెళ్లి బృందంతో ప్రయాణిస్తున్న ప్రైవేటు బస్సు ఢీకొన్న ఘటనలో ప్రయాణికులంతా సురక్షితంగా బయట పడ్డారు. వివరాల్లోకి వెళితే.. సుమారు 40 మంది ప్రయాణికులతో ఏలూరు నుంచి అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు ప్రైవేట్ బస్సులో పెళ్లి బృందం వెళుతుంది. ప్రత్తిపాడు సమీపాన ముందు వెళ్తున్న కోళ్ల వ్యాన్ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో వెనుక నుంచి వేగంగా వస్తున్న పెళ్లిబృందం బస్సు దానిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగం దెబ్బతింది. బస్సులోని నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. దీనిపై తమకు ఫిర్యాదు అందలేదని ప్రత్తిపాడు ఎస్సై ఎస్.లక్ష్మీకాంతం చెప్పారు.

ప్రజా దర్బారుకు అర్జీల వెల్లువ



తుని ప్రజా దర్బారులో అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే దివ్య

తుని: ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యనమల దివ్య అధికారులను ఆదేశించారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన ప్రజా దర్బారుకు ప్రజల నుంచి అర్జీలు వెల్లువెత్తాయి. స్వీకరించిన అర్జీలను ఆయా శాఖలకు చెందిన అధికారులకు పంపారు. ప్రజలకు జవాబుదారీగా అధికారులు వ్యవహరించాలని దివ్య సూచించారు. పట్టణంలో నూతనంగా నిర్మించే సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ నార్ల భువనసుందరి, మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, యనమల రాజేష్, సుర్ల లోవరాజు, ఇనుగంటి సత్యనారాయణ, ఎం.వెంకటేష్, తహసీల్దార్ ప్రసాద్, కమిషనర్ వెంకట్రావు పాల్గొన్నారు.

సబ్సిడీపై వ్యవసాయ పరికరాల పంపిణీ

ప్రత్తిపాడు: రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలను ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పంపిణీ చేశారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సభలో రూ.14 లక్షల సబ్సిడీతో రూ.34 లక్షల విలువ గల పవర్ టిల్లర్లు, స్ప్రేయర్లు, రోటావీలర్లు తదితర యంత్ర పరికరాలను 29 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే సత్యప్రభ అందజేశారు. జగ్గంపేట ఏడీఏ యింటి వీర గంగాధర్, శరభవరం సర్పంచ్ అమరాది వెంకట్రావు, యాళ్ల జగదీష్, గోవిందునాయుడు పాల్గొన్నారు.

తలసేమియా బాధితులకు అండగా నిలవాలి



తునిలో తలసేమియా బాధితుల కోసం రక్తదానం చేస్తున్న యువకులు

తుని: తలసేమియా బాధితులకు ప్రజలు అండగా నిలవాలని మమతా మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ పుష్ప రమావాణి కోరారు. ప్రపంచ తలసేమియా దినోత్సవం సందర్భంగా గురువారం రోటరీక్లబ్, మమతా ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 89 మంది రక్తదానం చేశారు. తలసేమియా వ్యాధి సోకిన బాధితులకు ఏడాదికి 18 సార్లు రక్త మార్పిడి అవసరమని రమావాణి తెలిపారు. తుని పరిసర ప్రాంతాల్లో 50 మందికి పైగా తలసేమియా బాధితులు ఉన్నారన్నారు. తుని రోటరీక్లబ్ అధ్యక్షుడు సీహెచ్ మంగరాజు, కార్యదర్శి ఎన్.వీర్రాజు, కోశాధికారి కె.కిశోర్ రెడ్డి, మమతా ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఏజీపీ చిట్టిబాబు



ఏజీపీగా నియామక ఉత్తర్వులు స్వీకరిస్తున్న చిట్టిబాబు

అన్నవరం: స్థానిక సీనియర్ అడ్వకేట్ రాజాల చిట్టిబాబు ప్రత్తిపాడు జూనియర్ సివిల్ కోర్టుకు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర లీగల్, లెజిస్లేటివ్ అఫైర్స్ అండ్ జస్టిస్ శాఖ కార్యదర్శి జి.ప్రతిభాదేవి గురువారం ఉత్తర్వులిచ్చారు. ఈ పోస్టు కాలపరిమితి మూడేళ్లు. నెలకు రూ.10 వేల చొప్పున గౌరవ వేతనం చెల్లిస్తారు. కాగా అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమితులైన చిట్టిబాబుకు పలువురు అభినందనలు తెలిపారు.

కల్యాణం.. కమనీయం

- వైభవంగా వేంకటేశ్వరస్వామి పరిణయ వేడుకలు
- వీక్షించిన భక్తులు



గండేపల్లిలో స్వామివారికి విశేష పూజలు నిర్వహిస్తున్న పండితులు

కిర్లంపూడి: చిల్లంగి శ్రీనివాస నగర్‌లో వేంచేసిన భూసమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం గురువారం కన్నులపండువగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు చక్రవర్తుల రాఘురామచార్యులు(రఘు), జగన్నాథచార్యులు ఆధ్వర్యంలో ఉదయం స్వామి, అమ్మవార్లను నూతన వస్త్రాలు, పుష్పాలతో అలంకరించి విశేష పూజలు చేశారు. రాత్రి ఏడు గంటల నుంచి వైఖానస ఆగమ ప్రతిష్ఠాపనాచార్య శ్రీమాన్ కేశవాచార్యులు స్వామివారి కల్యాణమహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాల భక్తులు తరలివచ్చి స్వామి కల్యాణమహోత్సవాన్ని తిలకించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వైభవంగా తంటికొండ వెంకన్న కల్యాణం

గోకవరం: మండలంలోని తంటికొండ గ్రామంలో ప్రసిద్ధిగాంచిన వెంకటగిరి కొండపై వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం గురువారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. రాత్రి 8 గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు ఆలయ ప్రాంగణంలోని మండపంలో వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య డప్పులు, బాజాలు, మేళతాళాల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణవేడుక నిర్వహించారు. దేవస్థానం మాజీచైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్నదొర, సువర్ధతులసీ దంపతులు పీటలపై కూర్చొని స్వామి వారి కల్యాణం జరిపారు. విశేష సంఖ్యలో భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించారు.



చిల్లంగిలో వేంకటేశ్వరస్వామి కల్యాణం జరిపిస్తున్న పండితులు

యల్లమిల్లిలో

గండేపల్లి: మండలంలోని యల్లమిల్లిలో చంద్రశేఖర స్వామి వార్షిక దివ్య కల్యాణ మహోత్సవం గురువారం రాత్రి వైభవంగా జరిగింది. ఆలయ ట్రస్టీ చంద్రమౌళి చిట్టిబాబు ఆధ్వర్యంలో పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు హరిబాబు, వీఎస్ఎన్ మూర్తి, శివ తదితరులు శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణం నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



కల్యాణ అలంకరణలో స్వామి, అమ్మవార్లు

పంచాహ్నిక దీక్షతో కల్యాణ మహోత్సవాలకు అంకురార్పణ

అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు వైశాఖ శుద్ధ ఏకాదశి, గురువారం ఉదయం పంచాహ్నిక కల్యాణ కార్యక్రమాలకు పండితులు అంకురార్పణ చేశారు. అనివేటి మండపంలో సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, గరుడ ధ్వజారోహణ చేశారు. ప్రధానార్చకులు ఇంద్రగంటి నర్సింహమూర్తి, కోట సుబ్రహ్మణ్యం ఇతర రుత్విక్కులు దీక్ష కంకణాలు ధరించారు. పూజా కార్యక్రమాలు నిర్వహించే రుత్విక్కులకు దీక్షా వస్త్రాలను ఆలయ చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ సుబ్బారావు పంపిణీ చేశారు.

వెంకన్న కల్యాణోత్సవాలు ప్రారంభం

గండేపల్లి: గ్రామంలో వేంచేసిన అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు నిర్వహించే కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామివారికి ప్రతి రోజు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మాజీ సీఎం జగన్‌ను కలసిన ఏడుకొండలు



మాజీ సీఎం జగన్‌తో మాట్లాడుతున్న గుల్లా ఏడుకొండలు

గోకవరం: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం మర్యాదపూర్వకంగా కలిసినట్టు ఆ పార్టీ ఉభయగోదావరి జిల్లాల ఎస్సీ సెల్ జోనల్ ఇంచార్జి, జగ్గంపేట నియోజకవర్గ లీగల్ అడ్వైజర్ గుల్లా ఏడుకొండలు తెలిపారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జగన్‌ను కలసి సోషల్ మీడియా కార్యకర్తలపై కూటమి ప్రభుత్వం బనాయిస్తున్న అక్రమ కేసులు, అరెస్టుల గురించి మాట్లాడినట్టు చెప్పారు. అక్రమ కేసులకు భయపడితే కూటమి ప్రభుత్వ అక్రమాలను బయట పెట్టలేమని, తెగువతో ముందుకు వెళ్తున్న సోషల్ మీడియా కార్యకర్తలకు పార్టీ అండగా ఉండాలని, నియోజకవర్గ సమన్వయకర్తలతో కలిసి పార్టీ కార్యకర్తలను కాపాడుకోవాలని, రానున్న రోజుల్లో మరింత ఉద్యమ స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని జగన్ సూచించినట్టు ఏడుకొండలు తెలిపారు.

మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ

ప్రత్తిపాడు: మహిళలు అన్ని రంగాల్లో స్వయం సమృద్ధి సాధించాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ కోరారు. స్థానిక డ్వామా ఉద్యోగుల శిక్షణా కేంద్రంలో జిల్లా బీసీ కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణా తరగతులను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ మూడు నెలల పాటు కొనసాగే ఈ శిక్షణ తరగతులను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ఉచితంగా కుట్టు మెషీన్లు, సర్టిఫికెట్లు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు, ఏపీఓ కుమారస్వామి, వెలుగు ఏపీఎం వై.వెంకట్, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సభ్యుడు వెలుగుల నాని, సుబ్బారెడ్డి సాగర్ ప్రాజెక్టు ఆయకట్టు సంఘం చైర్మన్ ఇళ్ల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్ సైనిక పరాక్రమానికి గర్వకారణం



తోట నరసింహం

గోకవరం: ఆపరేషన్ సిందూర్ విజయవంతం సైనిక పరాక్రమానికి గర్వకారణమని వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. భారత సాయుధ దళాలు నిర్ణాయక స్థాయిలో జరిపిన ఈ ప్రత్యేక ఆపరేషన్ దేశ భద్రతా రంగంలో మరో ఘన విజయంగా నిలిచిందన్నారు. భద్రతా సంస్థల ప్రణాళిక, జవాన్ల ధైర్యసాహసాలు ఈ విజయానికి పునాది వేశాయన్నారు. ఇటువంటి సమయంలో ప్రజలంతా ఐకమత్యంగా ఉండి దేశ సార్వభౌమత్వాన్ని చాటిచెప్పాలని కోరారు.

రోడ్డు నిర్మాణ పనుల పూర్తికి చర్యలు



తహసీల్దార్ సాయిప్రసాద్‌కు సమస్య వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నేత వీరబాబు

గోకవరం: స్థానిక ఇందిరమ్మ మోడల్ కాలనీ నుంచి రైతుల పంట పొలాల్లోకి వెళ్లేందుకు రూ.15 లక్షల ఎంపీపీ నిధులతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులు పూర్తికి అధికారులతో కలిసి చర్యలు చేపట్టినట్టు వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు తెలిపారు. రూ.15 లక్షలతో రైతులకు ఉపయోగకరంగా ఉండేందుకు పంట పొలాల్లోకి గ్రావెల్ మెటల్‌రోడ్డు నిర్మాణం చేపట్టారు. పలువురు రైతులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో పనులు మధ్యలో నిలిచిపోయాయి. దీంతో సమస్యను స్థానిక రైతులు ఎంపీపీ సుంకర శ్రీవల్లి, నాయకుడు సుంకర వీరబాబు దృష్టికి తీసుకువచ్చారు. దీంతో గురువారం తహసీల్దార్ సాయిప్రసాద్‌తో కలిసి వీరబాబు రోడ్డును పరిశీలించారు. రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చెయ్యకపోతే వర్షాకాలంలో రైతులు ఇబ్బందులు పడే అవకాశం ఉందని తహసీల్దార్‌కు వివరించారు. దీనిపై తహసీల్దార్ స్పందిస్తూ రోడ్డు నిర్మాణానికి ఉన్న అడ్డంకులపై రైతులతో సమావేశం నిర్వహించి వెంటనే రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు ఇనకోటి బాపన్నదొర, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

తెలుగు భాషా సదస్సుకు హాజరైన వరశ్రీ



ప్రశంసాపత్రంతో వరశ్రీ

తుని: హైదరాబాద్‌లోని చిక్కడపల్లిలో తెలుగుభాషకు పట్టాభిషేకం పేరిట గురువారం నిర్వహించిన తెలుగు భాషా సదస్సులో తునికి చెందిన కవి, తెలుగు ఉపాధ్యాయుడు ఈరంకి వీర వెంకటసత్యవరప్రసాద్(వరశ్రీ) పాల్గొన్నారు. తెలుగుభాష చైతన్య సమితి, లక్ష్యసాధన ఫౌండేషన్ 12వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో వరశ్రీ తెలుగు భాష గొప్పతనాన్ని పద్యాల రూపంలో అద్భుతంగా ఆలపించారు. అద్భుత ప్రదర్శన ఇచ్చిన వరశ్రీని నిర్వాహకులు ఘనంగా సత్కరించి ప్రశంసాపత్రం అందజేశారు.

విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ

ఏలేశ్వరం: వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా గురువారం విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో పిఠాపురానికి చెందిన చక్రపాణి చక్రవర్తి విద్యార్థులకు అక్షరాలతో చిత్రాలు గీయుట, సైన్స్ మ్యాజిక్, కథలు చదువుట, రాయుట, పద్యాలు చదివి భావాలు చెప్పుట తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులకు వివిధ కళలు, చిత్రలేఖనం, కథలు రాయడం, చదవడం, స్పోకెన్ ఇంగ్లిషు, మ్యాథ్స్, యోగా తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులు విధిగా విజ్ఞాన శిబిరాలకు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కోటనందూరు: విద్యుత్ లైన్లపై చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ వీరభద్రరరావు గురువారం తెలిపారు. రాజవరం ఫీడర్ విద్యుత్ లైనుపై చెట్ల కొమ్మల తొలగింపు, లైన్ మెయింటినెన్స్ కారణంగా కేఓ అగ్రహారం, కేపీ మల్లవరం గ్రామాల్లో గృహ వినియోగదారులు, పరిశ్రమలు, వ్యవసాయ అవసరాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ కరెంట్ ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

తాగునీటి సమస్య పరిష్కారమే లక్ష్యం

ప్రత్తిపాడు రూరల్: తాగునీటి సమస్య పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. మండలంలోని పెద్దిపాలెంలో నూతనంగా నిర్మించిన వాటర్ ట్యాంకును గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు ఇంటింటికీ తాగునీరు అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు దేవర రమేష్, ఏపూరి శ్రీను, కుండ్ల అప్పారావు, రీసు సత్తిబాబు, దేవ రమణ, కోరుకొండ శ్రీను, లొండ లోవరాజు, ఇళ్ల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

50 వసంతాల సభలను జయప్రదం చేయాలి

జగ్గంపేట: అరుణోదయ 50 వసంతాల సభలను జయప్రదం చేయాలని ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు కోరారు. ఈ మేరకు మండలంలోని రంగవల్లి నగర్‌లో గురువారం అరుణోదయ 50 వసంతాల వేడుకల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

విప్లవ వీరుడు అల్లూరికి ఘన నివాళి



అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సంఘ నాయకులు, మహిళలు

జగ్గంపేట: మండలంలోని రామవరంలో గురువారం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి నిర్వహించారు. సీపీఐ (ఎంఎల్) న్యూ డెమొక్రసీ, భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన పోరాట పటిమను కొనియాడారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మరుకుర్తి ఏసు, గంటా బాలరాజు, చిన్నారి, వీరవేణి, తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానం ఉద్యోగి కుటుంబానికి పరామర్శ



పెద్దింటి తలుపులయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ముదునూరి మురళీకృష్ణం రాజు

అన్నవరం: స్థానిక రత్నగిరి దేవస్థానంలో రికార్డు అసిస్టెంట్‌గా పని చేస్తూ గత నెల 25న మృతి చెందిన పెద్దింటి తలుపులయ్య కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు గురువారం పరామర్శించారు. తలుపులయ్య కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఏ సమస్య వచ్చినా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట గ్రామ మాజీ ఉప సర్పంచ్ పెద్దింటి నారాయణరావు, ఉపసర్పంచ్ బొబ్బిలి వెంకన్నబాబు, ఎంపీటీసీ దడాల సతీష్, పార్టీ నాయకుడు కొండపల్లి అప్పారావు తదితరులు ఉన్నారు.

యుద్ధం పట్ల అప్రమత్తంగా ఉండాలి



గుమ్మళ్లదొడ్డి ఐటీసీల్ ప్లాంట్ వద్ద మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న అధికారులు

గోకవరం: పాకిస్తాన్‌తో యుద్ధం అనివార్యమైతే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సాయిప్రసాద్, ఎంపీడీఓ గోవిందు సూచించారు. యుద్ధం వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం గోకవరం దేవీచౌక్ సెంటర్‌లో స్థానిక నాయకులతో కలిసి అవగాహన కల్పించారు. ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ అధికారుల సూచనలు పాటించాలన్నారు. అనంతరం గుమ్మళ్లదొడ్డిలోని ఐటీసీఎల్ టెర్మినల్ ఆధ్వర్యంలో పోలీస్, ఫైర్, వైద్యశాఖ ఇతర శాఖల అధికారుల సమన్వయంతో యుద్ధం వస్తే తీసుకోవాల్సిన చర్యలపై మాక్‌డ్రిల్ నిర్వహించారు.

ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా ర్యాలీ



కాట్రావులపల్లిలో ర్యాలీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

గండేపల్లి: ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా జగ్గంపేట మండలం కాట్రావులపల్లిలో గురువారం ర్యాలీ నిర్వహించారు. జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, జేఎస్పీ ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

గోకవరం: స్థానిక ప్రధాన రహదారి చెంత వేంచేసిన దాసాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకులు ఆరవిల్లి సీతారామాచార్యుల ఆధ్వర్యంలో అర్చకులు డాక్టర్ వల్లూరి జగన్నాథశర్మ, వల్లూరి శ్రీనివాస్‌శర్మ ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, తమలపాకులు, సింధూరంతో అభిషేకాలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతులు



విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తున్న అస్సాగో ప్రతినిధులు

గోకవరం: మండలంలోని గుమ్మళ్లదొడ్డి గ్రామంలోని అస్సాగో ఇథనాల్ పరిశ్రమ యాజమాన్యం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతి అందజేసింది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రథమ స్థానం సాధించిన సోడసాని శిరీషకు రూ.25 వేలు, ద్వితీయ స్థానం సాధించిన కొప్పాక భవ్యశ్రీనాగప్రవల్లిక, తృతీయ స్థానంలో నిలిచిన గంగిరాజు మోహన్‌సాయివికాస్‌కు రూ.10 వేలు చొప్పున నగదు పురస్కారం, సర్టిఫికెట్లను అందజేశారు. అస్సాగో ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.వెంకటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ కేవీ శుక్లా, హెచ్‌ఆర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అక్రమ సోదాలకు నిరసనగా ఆందోళన

- సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డి ఇంట్లో తనిఖీలను ఖండించిన జర్నలిస్టులు
- అధికారులకు వినతి పత్రాల అందజేత

తుని: రాజ్యాంగం కల్పించిన హక్కులను హరించేలా ప్రభుత్వం వ్యవహరించడంపై విలేకరులు గురువారం నిరసన గళమెత్తారు. తుని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పోలీసులు, సిట్ అధికారులు ముందస్తు నోటీసులు ఇవ్వకుండా సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డి ఇంట్లో తనిఖీలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. పత్రికా సమాజంలో ఇది బ్లాక్ డేగా అభివర్ణించారు. దీనికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. మీడియా ప్రతినిధులు రెడ్డి చిట్టిబాబు, ప్రవీణ్ చక్రవర్తి, ఎస్.వెంకట రమణ, లోవరాజు, ప్రకాష్, జోగేష్ తదితరులు పాల్గొన్నారు.



ఏలేశ్వరం తహసీల్దార్ కార్యాలయం వద్ద విలేకర్ల ధర్నా

- ఏలేశ్వరం: స్థానిక ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యాన పాత్రికేయులు నల్లబ్యాడ్జీలు ధరించి, తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేశారు. డిప్యూటీ తహసీల్దార్ కుశరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పత్రికా స్వేచ్ఛను హరించడం సరికాదని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు స్వర్ణపూడి శ్రీను, కోరాడ శ్రీనివాసరావు, దొంతంశెట్టి సతీష్, శిడగం మాధవ, చిలికోటి సుధీర్, తొగరా సూరిబాబు, గ్రంధి స్వామి, పారేపల్లి గంగాప్రసాద్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.



తునిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న మీడియా ప్రతినిధులు

- ప్రత్తిపాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద విలేకరులు నల్లబ్యాడ్జీలు ధరించి ధర్నా నిర్వహించి, డిప్యూటీ తహసీల్దార్ కె.పుణ్యవతికి వినతి పత్రం అందజేశారు. విలేకరులకు ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) రాష్ట్ర కార్యదర్శి బుగత శివ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాశారనే సాకుతో సాక్షి పత్రిక సంపాదకులు ధనంజయరెడ్డి నివాసంలో పోలీసులు భయానక వాతావరణం సృష్టించి, సోదాలు చేయడం అప్రజాస్వామికమని అన్నారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు బర్ల లోవరాజు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఎస్‌వీ సోమేశ్వరరావు, ప్రగడ రామకృష్ణ, ప్రత్తి శ్రీనివాసరావు, తుమ్మల సుబ్బు తదితరులు పాల్గొన్నారు.
- కోటనందూరు: స్థానిక ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యాన విలేకరులు నల్లబ్యాడ్జీలు ధరించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. తహసీల్దార్ టి.సుభాష్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రజా సమస్యలపై రాజీ లేని పోరాటం చేస్తున్న సాక్షి దినపత్రికపై ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. వాస్తవాలను వెలుగులోకి తీసుకుని వస్తున్న విలేకర్లపై దాడులు చేసి, భయభ్రాంతులకు గురు చేయడం, కేసులు బనాయించడం అన్యాయమని అన్నారు.

తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేత

గండేపల్లి: సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంట్లో ఆకస్మిక తనిఖీలకు నిరసనగా నియోజకవర్గ కేంద్రమైన జగ్గంపేటలో గురువారం విలేకరులు ఆందోళన చేశారు. ఈ మేరకు జగ్గంపేట తహసీల్దార్ జేవీఆర్ రమేష్‌కు వినత పత్రం అందజేశారు. పాత్రికేయులపై ఇటీవల కాలంలో దాడులు జరుగుతున్నాయని, ఇది కచ్చితంగా పత్రికా స్వేచ్ఛను హరించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గండేపల్లి, జగ్గంపేట, కిర్లంపూడి మండలాల విలేకర్లు ఎన్.శ్రీధర్, ఎస్.కృష్ణ, ఎ.శ్రీనివాస్, ఎస్.శ్రీను, టి. బాపిరాజు, బి.దుర్గారావు, శ్రీను, బాబి, తదితరులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న మీడియా ప్రతినిధులు



జగ్గంపేటలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న విలేకరులు



కోటనందూరులో తహసీల్దార్ సుభాష్‌కు వినతిపత్రం అందజేస్తున్న విలేకర్లు